మంత్రి చెప్పారు.. పూడిక తీశారు..!

అయినవిల్లి, న్యూస్‌టుడే: ముక్కామల-అమలాపురం ప్రధాన రహదారిలోని ఎన్ పెద పాలెం వద్ద రహదారి విస్తరణలో భాగంగా పంట కాలువకు రక్షణ గోడ నిర్మించారు. మట్టి తొలగించకపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీనిపై ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన గుత్తేదారులు మంగళవారం పంటుపై జేసీబీని ఏర్పాటు చేసి కాలువలో పూడిపోయిన మట్టిని తొలగించే పనులు ప్రారంభించారు.

ఊడుగులమ్మకు సారె సమర్పణ

ఆలమూరు, న్యూస్‌టుడే: మోదుకూరు గ్రామ దేవత ఊడుగులమ్మకు మంగళవారం ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు వివిధ రకాల పిండి వంటలు, పండ్లు, చీరలు, పసుపు, కుంకుమతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

28, 29 తేదీల్లో బుద్ధవిహార్ ప్రారంభం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: బుద్ధగయలోని మహాబోధి పుణ్యక్షేత్ర నమూనా స్ఫూర్తితో ఉండ్రాజవరంలో బుద్ధవిహార్‌ను నిర్మించినట్లు బౌద్ధ పీఠాధిపతి బంతే అనాలయో తెలిపారు. సర్వహంగులతో రూ.7కోట్లతో నిర్మించామన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో ప్రారంభోత్సవం చేయనున్నట్లు మంగళవారం తెలిపారు. అనంతరం ఆహ్వానపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరించి ప్రదర్శించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు థాయ్‌లాండ్, వియత్నాం, శ్రీలంక తదితర దేశాల నుంచి బౌద్ధ పీఠాధిపతులు, భిక్షువులు రానున్నట్లు చెప్పారు. బుద్ధ పూజ, ధర్మోపదేశం, తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జయజయ వారాహి..

రాజమహేంద్రవరం గ్రామీణంలోని బొమ్మూరు గౌరీచంద్రమౌళీశ్వర ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సమర్పించిన చీరను అలంకరణ చేశారు. శ్రీచక్రార్చన, చంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు

పర్యాటక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ : మంత్రి దుర్గేష్

మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న స్థానికులు

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటకానికి గతంలో రెండు అవార్డులు వచ్చాయని, తాజాగా మరో అవార్డు రావడం ఆనందంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి పర్యాటక బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు అందుకున్న మంత్రి మంగళవారం నిడదవోలు వచ్చారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. జనసేన నాయకులు శాలువాతో సత్కరించారు. కేంద్రం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పర్యాటకాభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డులు నిదర్శనమన్నారు. దేశీయ, అంతర్జాతీయ వివాహ వేడుకలకు రాష్ట్రాన్ని గమ్యంగా మారుస్తామన్నారు. ● తాళ్లపాలెం అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. వర్షపునీటిని తోడేందుకు మోటార్లు ఏర్పాటు చేయాలన్నారు. తాడేపల్లిగూడెం వెళ్లే మార్గంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం వంతెన వద్దకు వెళ్లి పరిశీలించారు.

ఆలయ ప్రాంగణం అస్తవ్యస్తం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో గుమ్మటాలు (వివాహ అలంకరణ) సామగ్రిని ఎక్కడపడితే అక్కడే వదిలేయడంతో భక్తులకు అసౌకర్యంగా ఉంటోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. సత్య, రత్నగిరులపై విష్ణుసదన్, హరిహరసదన్ పక్కన ఖాళీ ప్రదేశం, ఆలయ ప్రాంగణాలు తదితర ప్రదేశాల్లో వివాహాలు జరుగుతుంటాయి. ఇక్కడ మండపాలు ఏర్పాటు చేసి వివాహ క్రతువు ముగిసిన వెంటనే వాటిని తీసి వేయాలి. కానీ నిర్లక్ష్యంగా రోజుల తరబడి వదిలేస్తున్నారు. విష్ణుసదన్ కొన్ని గదుల్లో అలంకరణ సామగ్రినీ అలాగే వదిలేస్తున్నారు. దీంతో వార్షిక కల్యాణ వేదికపై జరిగే వివిధ వైదిక కార్యక్రమాలు భక్తులకు కనిపించడం లేదు. విశ్రాంతి తీసుకోవడానికి అసౌకర్యంగా ఉంటోంది.

గతంలో హెచ్చరించినా..

ఇటీవల వార్షిక కల్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన మండపం

గతేడాది అక్టోబరు 25న దేవాదాయశాఖ కమిషనర్ అన్నవరం వచ్చిన సమయంలో విష్ణుసదన్ గదుల్లో వివాహాలు పూర్తయిన తర్వాత కూడా మండపాలు, కుర్చీలు, ఇతర సామగ్రి తొలగించకపోవడంపై నిలదీశారు. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. అయినా అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు.. సోమవారం మరోసారి కమిషనర్ పర్యటన సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. హరిహరసదన్ పక్కనే వివాహానికి వేసిన షెడ్డు అలానే వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తేదారుకు జరిమానా విధించాలని ఆదేశించడంతో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

సౌకర్యాలు ఉన్నా.. ఉపయోగం సున్నా..



సత్యగిరిపై దుస్తులు మార్చుకునే గది ఇలా

ఇది సత్యగిరిపై ఎం.ఎస్ రెడ్డి ఉచిత కల్యాణ మండపంలోని పరిస్థితి. దాత సహకారంతో నిర్మించిన ఈ మండపంలో వందలాది మంది వివాహాలు చేసుకుంటారు. వీరికి సౌకర్యవంతంగా ఉండేలా దుస్తులు మార్చుకునేందుకు ఏడు గదులను అన్ని సౌకర్యాలతో నిర్మించారు. అయితే వీటి నిర్వహణపై అధికారులు దృష్టిసారించడం లేదు. దాన్యం బస్తాలు, కుర్చీలు, పారిశుద్ధ్య సామగ్రి వంటివి ఉంచుతుండటంతో భక్తులు వినియోగించుకునేందుకు వీలు లేకుండా ఉంది.

సదరం పరీక్షలకు సహాయకేంద్రాలు

హెల్ప్ డెస్క్ వద్ద సూపరింటెండెంట్ లావణ్యకుమారి తదితరులు

మనీడుసెంటర్, న్యూస్‌టుడే: సదరం స్లాట్‌తో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి తెలిపారు. జీజీహెచ్‌లోని ఓపీ బ్లాక్ మెట్ల సమీపంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఆమె ప్రారంభించారు. ఇక్కడకు వచ్చిన వారికి మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ సిబ్బంది దిశానిర్దేశం చేస్తారన్నారు. కొంతమందికి ఒక వైకల్యం మాత్రమే ఉన్నా కూడా సచివాలయంలో తప్పుగా మల్టిపుల్ డిజబిలిటీ విభాగంలో స్లాట్ ఇవ్వడం వల్ల ప్రజలు అనవసర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. సదరం నోడల్ ఆఫీసర్ డా.వి. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో కలెక్టర్ పర్యటన

నేడు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమలగా పేరుగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు బుధవారం కలెక్టర్ మహేష్‌కుమార్ వస్తున్నట్లు ఈవో నల్లం చక్రధరరావు మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ పర్యటన ఉంటుందన్నారు.

ఆషాఢం దేవీ దర్శనం యాత్ర

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు సిద్ధం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసంలో ఉమ్మడి జిల్లాలోని అమ్మవార్ల పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా రావులపాలెం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 'ఆషాఢం దేవీ దర్శనం యాత్ర' పేరిట యాత్ర నిర్వహిస్తున్నారు.

☞ చింతలూరు నూకాంబిక అమ్మవారు, మట్లపాలెం మహాలక్ష్మి, కాకినాడ వారాహి, పిఠాపురం పురూహూతిక, తాడిపర్తి అపర్ణాదేవి, కాండ్రకోట నూకాలమ్మ, కడియపులంక ముసలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకోవచ్చు.

☞ ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.450గా ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈనెల 31వ తేదీ శుక్రవారం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని, ఇతర వివరాలకు 73829 11871, 73829 12398 నంబర్లలో సంప్రదించాలని డిపో అసిస్టెంట్ మేనేజర్ సూచించారు.

యువకుడిపై పోక్సో కేసు

మనీడుసెంటర్: బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై కాకినాడ మూడో పట్టణ పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. సూర్యనారాయణపురానికి చెందిన కడవల గిరి(24) తన బంధువైన 14 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఓ వ్యక్తి ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు కుటుంబసభ్యులందరినీ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిపై కలెక్టర్ నివేదిక పంపారు. ఆయన ఆదేశాలతో 28బి వార్డు వీఆర్‌వో బి.శ్రీనివాసరావు అక్కడకు వెళ్లి విచారించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై బాలిక కుటుంబసభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయలేదు.

జయలక్ష్మి సొసైటీపై కలెక్టర్ సమావేశం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జయలక్ష్మి సొసైటీ బాధితుల సమస్యలపై కలెక్టర్ హరేంధిరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సొసైటీలో జరిగిన అక్రమాలు, అవినీతిని గుర్తింపు ఉన్న మూడు సంఘాల ప్రతినిధులు వివరించారు. బాధ్యుల నుంచి సొమ్ము రివకరీకి పతినిధులంతా ఐక్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అధికారులతో రెండు, సంఘాల సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, తద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

రూ.కోటి చెల్లించని కేసులో ధాన్యం వ్యాపారికి రిమాండ్

గొల్లప్రోలు: కమీషన్ వ్యాపారి నుంచి ధాన్యం కొనుగోలు చేసి సొమ్ము చెల్లించని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పసివేదల గ్రామానికి చెందిన దుద్దిపూడి సూరిబాబును అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్సై రామకృష్ణ తెలిపారు. గొల్లప్రోలుకు చెందిన పిండి ధనరాజ్ రైతుల నుంచి ధాన్యం సేకరించగా, అతని నుంచి సూరిబాబు కొనుగోలు చేశాడు. రూ.2 కోట్లకు గాను రూ.కోటి పలు దఫాలుగా చెల్లించి మిగిలింది ఇవ్వకుండా పరారీలో ఉన్నాడు. ఆ మేరకు అతనికి రిమాండ్ పడిందన్నారు.

పోలీసు ఉద్యోగాల ఖాళీలన్నీ భర్తీ చేయాలని ధర్నా

నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాకినాడలో నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కొండయ్యపాలెం పైవంతెన వద్ద ఉన్న జెండా కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 2,500 కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి చేపడతామని ప్రకటించిందని, కానీ మొత్తం 11,639 ఖాళీలున్నాయని, వాటిలో 10 వేల కొలువులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో విజయవాడ నిర్వహిస్తామని ప్రకటించారు. అర్హత వయసు 35 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ ప్రతినిధులు టి.రాజా, వాసు, సత్యం, జయరాం, ఆదర్శ కార్తీక్, రాజు, రామకృష్ణ తదితరులున్నారు.

బీసీల సమస్యలపై 'చలో జంతర్‌మంతర్'

సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

కాకినాడ నగరం: బీసీ సమస్యల పరిష్కారానికి జాతీయ బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 27న చలో జంతర్‌మంతర్ (ఢిల్లీ)కి తరలిరావాలని బహుజన బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక రామారావుపేట శెట్టిబలిజ సామాజిక భవనంలో మంగళవారం బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉన్నా ప్రభుత్వాలు నెరవేర్చడం లేదన్నారు. బీసీలకు ఉద్యోగ, పదోన్నతులు, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లను కల్పించాల్సి ఉందని చెప్పారు. ఈ డిమాండ్ల అమలుకు జంతర్‌మంతర్ వద్ద జరిగే దర్నాకు పెద్దఎత్తున బీసీలు తరలి రావాలని సూచించారు. సంఘ నాయకులు గుత్తుల శ్రీనివాస్, రాయుడు నాగేశ్వరరావు, పి.నాగరాజు, నారాయణరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

బొమ్మూరు కూడలిలో ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

'మాజీ మంత్రి అంబటి క్షమాపణలు చెప్పాలి'

బొమ్మూరు, న్యూస్‌టుడే: హోంమంత్రి వంగలపూడి అనితపై గుంటూరులో ఇటీవల మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. రాజమహేంద్రవరం గ్రామీణం పరిధి బొమ్మూరు కూడలిలో మంగళవారం రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ రాంబాబు వెంటనే మంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. వైకాపా అధినేత జగన్ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార ప్రతినిధి యార్లగడ్డ సతీష్ మాదిగ కోరారు.

కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నం

తొమ్మిది మంది అరెస్టు

రాజానగరం, న్యూస్‌టుడే: పశువులను తరలిస్తున్న వాహనాల డ్రైవర్లను కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నించిన తొమ్మిది మందిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీఎస్పీ సి.హెచ్.జీవన తెలిపారు. రాజానగరం పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ, సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి పాతపట్నంలో రైతుల నుంచి ఆరు ఎద్దులను కొన్నారు. వాటిని అమరావతి పరిధిలోని కోసూరు సంతకు తీసుకెళ్లి వెంకటేష్ అనే రైతుకు అప్పజెప్పాల్సి ఉంది. కొండపల్లి రవి, తాడేలా నవీన్, ఆలాపన దాలిరాజు అనే డ్రైవర్లతో రెండు వాహనాల్లో వాటిని పంపించారు. ఈనెల 9న పాతపట్నం నుంచి ఎద్దులతో వాహనాలు బయలుదేరాయి. 10న తెల్లవారుజామున కాలకృత్యాల కోసం రాజానగరం హైవేపై వారు ఆగారు. అంతలో రెండు వాహనాల్లో కొంత మంది వ్యక్తులు వచ్చి కత్తులు చూపి రవి, నవీన్, దాలిరాజును బెదిరించారు. పశువుల వాహనాలను పల్లకడియం వద్దకు తీసుకెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. తమ వద్ద డబ్బులు లేవని, వదిలేయాలని ముగ్గురూ ప్రాధేయపడటంతో వారు వెళ్లిపోయారు. దీనిపై బాధిత డ్రైవర్లు ఇచ్చిన ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.వి.వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేశారు. దీనికి సంబంధించి మంగళవారం తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరంతా రాజమహేంద్రవరంలోని వెండి, చరవాణులు, గిఫ్ట్ షోరూంల్లో పనిచేస్తున్నట్లు గుర్తించామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

టైరు పేలి.. అక్రమ రవాణా వెలుగులోకి వచ్చి..

సూర్యనారాయణపురం వద్ద వాహనంలో ఆవులు

దేవరపల్లి: టైరు పేలి రహదారిపై ఆగిన వాహనాన్ని పరిశీలించగా ఆవుల అక్రమ రవాణా వెలుగు చూసింది. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం సూర్యనారాయణపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... విజయనగరం జిల్లా అలమండ సంత నుంచి పల్నాడు జిల్లా కోసూరు సంతకు ఆవులను తరలిస్తున్న బొలెరో వ్యాన్ సూర్యనారాయణపురం 16 నంబరు జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి టైరు పేలిపోయింది. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. తెల్లవారుజామున అటుగా వెళుతున్న రైతులు వ్యాన్ నుంచి ఆవుల అరుపులు వినిపించడంతో పరిశీలించారు. ఒకదానిపై మరొకటి పడి ఉన్న సుమారు 12 గోవులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆవులను గోశాలకు తరలించామని ఎస్సై పి.మనోహర్ తెలిపారు.

పారదర్శక సేవలకే 396 జీవో

సామర్లకోట, న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)లతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థంగా, పారదర్శకంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విధానంలో అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దానిలో భాగంగానే 396 జీవోను తీసుకొచ్చారన్నారు. ఆర్ఎస్‌కేల ఏర్పాటుపై అపోహలు, అసత్య ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానం అంటే ప్రైవేటీకరణ చేయడం కాదన్నారు.

అనధికార లేఅవుట్లపై దాడులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ పట్టణాభివృద్ధి సంస్థ (కౌడా) పరిధిలో వివిధ ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు, ప్లాట్లపై రెండోరోజు మంగళవారం కూడా దాడులు కొనసాగాయి. కౌడ వీసీ, జేసీ అపూర్వభరత్ ఆదేశాల మేరకు నియమించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో పర్యటించారు. పనసపాడు, జి.రాగంపేట, చంద్రమాంపల్లి, కాండ్రకోట గ్రామాల్లోని లేఅవుట్లలో అక్రమ నిర్మాణాలను తొలగించారు. కౌడ ఏపీవోలు కేవీ కృష్ణ, ఎస్.రామిరెడ్డి, డి. ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూపాలలో)
కొత్తకొబ్బరి	15,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	24,000
గటగట	22,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	21,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	15,000-15,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	150-00
రిటైల్ లైవ్	177-00
డ్రెస్డ్	274-00
స్కిన్‌లెస్	310-00

ఆర్ఎస్‌కేల ప్రతిపాదనను విరమించుకోవాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల కార్యాలయాల వద్ద సేవాకేంద్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు తలపెట్టిన పెన్‌డౌన్ రెండోరోజు మంగళవారం కొనసాగింది. దీంతో జిల్లాలో ఉన్న 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలూ బోసిపోయాయి. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో దస్తావేజు లేఖరులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు తదితరులు పెన్‌డౌన్‌లో భాగంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. సంఘ కాకినాడ నగరాధ్యక్షుడు చోడపునీడి గోవిందరావు, సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బీజే ప్రసాద్, కార్యదర్శి గీసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే) వల్ల తామంతా రోడ్డున పడతామని పేర్కొన్నారు. ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెచ్చే రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదని చెప్పారు. సంఘ నాయకులు అప్పలరాజు, వి.వి.వి.సత్యనారాయణ, మోహనరావు, సత్తిబాబు, వాసు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖరులు

SHORT TENDER NOTICE

No. 12/2026-27; Dt. 21-07-2026.

Tenders are invited for 3 works in the Government General Hospital, Kakinada.

Details can be had from

http://tender.apeprocuremnet.gov.in.

Sd/- Executive Engineer

APMSIDC Division, Kakinada.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బ్యాంక్ ఆఫ్ బరోడా)

ROSARB ప్రాంతీయ కార్యాలయం (రాజమండ్రి)

5వ అంతస్తు, 36-7-14, కొండూరి స్క్వేర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533102, ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 0883-2490509, ఇమెయిల్ : sarrjy@bankofbaroda.com

ఈ వేలం ద్వారా వాహనములు అమ్మకం https://www.bankeauctions.com

ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీతలు బకాయి చెల్లింపు నందు విఫలమగుటచే బ్యాంక్ వారు ఋణగ్రహీత మరియు హామీదారులచే అమలుచేయబడిన తనఖా ఒప్పందము క్రింద సంక్రమించిన అధికాములను వినియోగించుకుంటూ వారి వద్ద తనఖా ఉంచిన దిగువ తెలిపిన వాహనములను తిరిగి స్వాధీనత/జప్తు చేసికొని "ఎక్కడ ఎలా ఉందో అలాగే & ఏది ఉందో అది అలాగే" అను ప్రాతిపదికన వేలం ద్వారా విక్రయం జరుపుచున్నారు. మరియు వేలం నోటీసు నందు సవిరముగా చెప్పిన నియమములు & నిబంధనలకు లోబడి మాత్రమే అమ్మకం జరుపబడును.

వ. నెం.	ఋణగ్రహీత పేరు & చిరునామా	బకాయి మొత్తం	వాహనం తయారీ & మోడల్, ఆర్‌టిఓ రిజిష్టర్డు నెం.	రిజర్వు ధర	ధరావత్తు
1)	శ్రీ జనుపే అరుణ్‌కుమార్, # 3-33/1బి, అంబేద్కర్ వీధి దగ్గర, రాజానగరం, తూర్పు గోదావరి, ఆం.ప్ర.-533294	రూ. 22,07,926.50 పై. + తేది. 08-08-2024 నుండి వడ్డీ	Eicher PRO 3015XP J HSD BS6 Vehicle No : AP39UP 9889	రూ. 13,00,000/- (జియస్‌టి తో కలిపి)	రూ. 1,30,000/-
2)	శ్రీ షేక్ గౌసియా బేగం, భర్త : లాల్ బాషా, 6-129, తొర్రేడు, గంగాలమ్మ గుడి దగ్గర, తూర్పు గోదావరి, ఆం.ప్ర.-533293	రూ. 36,29,359/- + తేది. 13-11-2024 నుండి వడ్డీ	Vehicle No:AP39VA 2339 Make: Mahindra & Mahindra Ltd Model: BLA2035HLBS6P61CB	రూ. 19,50,000/- (జియస్‌టి తో కలిపి)	రూ. 1,95,000/-
3)	శ్రీ నందికోళ్ళ శ్రీనివాస రావు, 5-26, అంబేద్కర్ వీధి, రామచంద్రాపురం, సీతానగరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.-533287	రూ. 21,25,722/- + తేది. 13-05-2024 నుండి వడ్డీ	Ashok Leyland CA1615/47 H FBL AP 39 UQ3969	రూ. 9,50,000/- (జియస్‌టి తో కలిపి)	రూ. 95,000/-

వేలం జరుగు ప్రదేశం : బ్యాంక్ ఆఫ్ బరోడా, ROSARB Branch, Rajahmundry బ్రాంచ్, రాజమండ్రి నందు వేలం తేది : 12.08.2026, సమయం: మ.02.00 గం॥ల నుండి సా.06.00 గం.ల వరకు.

బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-., ఆసక్తి గల కొనుగోలుదారులు / బిడ్డర్లు ఈ తనఖా ఉంచిన చరాస్తులను తేది.11.08.2026 న (ఈ తేదీ లోపు) ఉదయం గం.10.30 ని.ల నుండి సాయంత్రం గం.4-00 ల వరకు తనిఖీ చేసుకొనవచ్చును. ధరావత్తు డ్రాఫ్ట్ : "బ్యాంక్ ఆఫ్ బరోడా" ROSARB Branch, Rajahmundry బ్రాంచ్, రాజమండ్రి ఖాతా నెం.62670015181869, IFSC CODE : BARB0SARRJY, ద్వారా జమచేయవచ్చును. పూర్తి వివరముల వేలం నోటీసు & టెండరు దరఖాస్తు బ్యాంక్ వారి యొక్క వెబ్‌సైట్ www.bankofbaroda.co.in నందు అప్‌లోడ్ చేయబడినది. మరియు బ్రాంచ్ నందు కూడా లభించును. కావున దయచేసి గమనించగలరు. ఇతర ఏమైనా సమాచారాము కొరకు బ్రాంచ్ సెల్ : 7569961199 నందు సంప్రదించగలరు. ఈ-మెయిల్ ఐడి : support.BAANKNET@psballiance.com. వాహన రిజిస్ట్రేష